క్లుప్తంగా

సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళి

సీటీఆర్ఐ: స్వాతంత్ర్య సమరయోధుడు, గీతకులాల ఆపద్బాంధవుడు, బడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలను కొనసాగించాలని వాసంశెట్టి గంగాధరరావు, కోడి ప్రవీణ్ అన్నారు. గోదావరి గట్టున వాటర్ వర్క్స్ పక్కన ఉన్న గౌతు లచ్చన్న విగ్రహానికి శెట్టి బలిజ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న అని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ అన్నారు. లాలాచెరువు స్వర్ణాంధ్ర వృద్ధుల ఆశ్రమంలోని గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వృద్ధులకు కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

కడియం: మురమండ పంచాయతీ పరిధి దొరగారితోటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు బుధవారం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి రూ. పదివేలు, బియ్యం అందజేశారు. అలాగే మాధవరాయుడు పాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి, టీడీపీ నాయకులు వరగోగుల రుద్రయ్య, ఏక్‌మదర్ సాహెబ్ తదితరులు కూడా తమవంతు అందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్, పార్టీ నాయకులు ప్రత్తిపాటి రామారావు చౌదరి, వరగోగుల సత్యనారాయణ, ముమ్మిడి దేవీనాగేశ్వరరావు, శీలం రవి పాల్గొన్నారు.

మసీదుల్లో సామూహిక ప్రార్థనలు

సీటీఆర్ఐ: పవిత్ర రంజాన్ మాసంలోని చివరి పదిరోజులలో భాగంగా నగరంలో అన్ని మసీదులలో మంగళవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ జాగారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక ప్రార్థనలు, ధార్మిక సందేశాలతో గడిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ప్రార్థనలు నిర్వహించిన ఖురాన్ హఫీజ్‌లను సత్కరించారు. మెయిన్ రోడ్డులోని రాయల్ మాస్క్ కమిటీ తరఫున సలహాదారు అసదుల్లా అహ్మద్ ఉత్తర్ ప్రదేశ్ నుంచి వచ్చిన హఫీజ్ షమీమ్ సాహెబ్‌ను సత్కరించారు. మసీదు ఇమామ్ హాజీస్ హఫీజ్ ఖాన్, మౌజాన్ ఇబ్రహీం, జహంగీర్ తదితరులను ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షులు ఎస్ఏ కరీం, ట్రస్టీ ఘన్ షా, మూస, ఆరిఫ్ నూతన వస్త్రాలతో సత్కరించారు.

బాధితులకు ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న తాడాల చక్రవర్తి

కడియం: మురమండ గ్రామంలో అగ్నిప్రమాద బాధితులకు కడియం మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణు చక్రవర్తి ఆర్థిక సహాయం, 50 కేజీల బియ్యం అందజేశారు. దొరగారితోటకు చెందిన పల్లా రమణమ్మ, చింతాలమ్మ పుంతకు చెందిన పండూరి అప్పారావు కుటుంబాలకు రూ.10,000, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అయినవల్లి రుక్మిణి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మెల్లిమి మంగా గంగరాజు, గొడవర్తి ప్రసాద్, యర్రా సూర్యనారాయణ, కొప్పాక రమణ, బిళ్లకుర్తి చిన్నా పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఒక యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం శాటిలైట్ సిటీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రపురం గుబ్బల వారివీధికి చెందిన టేకుమూడి సత్యప్రియ (25) తన స్నేహితురాలు, శాటిలైట్ సిటీలోని మదపాటి జానకి ఇంటిలో ఉంటుంది. సత్యప్రియ, జానకి ఇద్దరూ ఏడేళ్లక్రితం ధవళేశ్వరంలో నర్సింగ్ చదువుకున్నారు. అప్పటి నుంచి మంచి స్నేహితులుగా ఉంటున్నారు. ఇద్దరూ హైదరాబాద్‌లో ఉంటూ ఉద్యోగం చేసుకునేవారు. ఇటీవల జానకికి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ఉద్యోగం రావడంతో శాటిలైట్ సిటీ వచ్చేసింది. జానకితో పాటు సత్యప్రియ ఇక్కడకు వచ్చేసి ఉంటుంది. ఇటీవల జానకికి పెళ్లి సంబంధం కుదిరింది. బుధవారం ఉదయం చూసేసరికి సత్యప్రియ చున్నీతో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సత్యప్రియ తల్లి దుర్గ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై శివాజీ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వచ్చే ఎన్నికల్లో సిటీ ఎమ్మెల్యేగా వాసు పోటీ

సీటీఆర్ఐ: 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి, అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ఆ పార్టీ నాయకులు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2022లో కంబాల చెరువులో సుమారు రూ.రెండు కోట్లతో ఏర్పాటు చేసిన లేజర్ ఫౌంటెన్ మరుగున పడిందని ఆరోపించారు. నగరంలో జరుగుతున్న పనులన్నీ ప్రజలు చెల్లించిన పన్నుల ద్వారా సాధారణ నిధులతో చేపట్టారన్నారు.

మొక్కలకూ తప్పని కాపలా

- మిర్చిమేరిగోల్డ్ మొక్కకు డిమాండ్
- వాటిని చోరీ చేస్తున్న దొంగలు
- నర్సరీ రైతుల అవస్థలు



కడియం ప్రాంత నర్సరీల్లో సాగవుతున్న మిర్చిమేరీ గోల్డ్ మొక్కలు

కడియం: నర్సరీల్లో మొక్కలకూ కాపలా తప్పడం లేదు. కడియం ప్రాంతంలో సుమారు ఏడున్నరవేల హెక్టార్లలో నర్సరీ రంగం విస్తరించి ఉంది. ఇక్కడ 350కి పైగా అలంకరణ, పండ్లు, పువ్వుల రకాల మొక్కలు రూ.5 నుంచి 50 లక్షల వరకు విలువైన వాటిని రైతులు అభివృద్ధి చేస్తుంటారు. ఇదే క్రమంలో మిర్చిమేరీ గోల్డ్ రకం మొక్కలను కూడా స్థానికంగా పలువురు రైతులు పెంచుతారు. అయితే ఈ రకం మొక్క సున్నితంగా, ఎదుగుదల నెమ్మదిగా ఉంటుంది. ప్రస్తుతం ఈ రకానికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. రూ.900 నుంచి రూ.1100 గతంలో అమ్మే మొక్క ఇప్పుడు రూ. రెండు వేలు పలుకుతోంది. వీటి విత్తనమే రూ.75 నుంచి రూ.100కు విక్రయిస్తున్నారు. చిన్నపాటి మొలక వచ్చిన మిర్చిమేరీ గోల్డ్ మొక్క రూ.200 పలుకుతోంది.

చూడగానే ఆకట్టుకునేలా..

ఈ నేపథ్యంలో మిర్చిమేరీగోల్డ్ మొక్కలపై దొంగల కన్ను పడింది. చిన్న సైజులో ఉండే ఈ మొక్కలు, వీటి విత్తనాలను మాయం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. పసుపురంగులో చూడగానే ఆకట్టుకునే విధంగా ఉండే ఈ మొక్కల ఉత్పత్తి స్థానికంగా తక్కువ కావడంతో డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. అతి తక్కువ మంది రైతుల వద్ద మాత్రమే ఇవి ప్రస్తుతం అందుబాటులో ఉంటాయి. మొక్కను ప్యాకెట్‌లో వేసిన తరువాత దాదాపు మూడేళ్ల పాటు పెంచాలి. నేలపై నాటితే ఏడెనిమిదేళ్లకు గానీ విత్తనాలు తయారుకావు. థాయ్‌లాండ్ వంటి చోట్ల నుంచి కొందరు రైతులు వీటిని దిగుమతి చేసుకుని మరీ అభివృద్ధి చేస్తున్నారంటే వీటికి ఏర్పడిన డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు.

బాబోయ్ దొంగలు

కొనుగోలుదారుల నుంచి డిమాండ్ పెరగడంతో ఈ మొక్కలు చోరీకి గురవుతున్నాయి. మొక్కలపై ఆసక్తితో ఎవరైనా ఒకటి రెండు పూలు, పండ్ల మొక్కలను తీసుకుపోతుంటారు. రైతులకు తెలిసినా చూసీచూడనట్లు ఊరుకుంటారు. అయితే ధర పెరగడంతో ఈ రకం మొక్కలను రైతులు కాపలా పెట్టి మరీ కాపాడుకుంటున్నారు. అయినప్పటికీ దొంగలు వదలడం లేదు. కడియపులంక పంచాయతీ పరిధిలో సుమారు రెండున్నర లక్షల రూపాయల విలువైన మొక్కలను ఇటీవలే చోరీ చేశారు. అలాగే వీరవరం పరిధిలోని ఒక రైతు నుంచి భారీగా విత్తనాలను పట్టుకుపోయారు. సోమవారం రాత్రి కూడా మురమండ గ్రామం పరిధిలో కూడా మిర్చిమేరీగోల్డ్ విత్తనాలను దొంగిలించేందుకు ఇద్దరు యువకులు వచ్చిన విషయం విదితమే. అక్కడ కాపలాగా ఉన్న రైతు అప్రమత్తం కావడంతో దొంగలు తాము వేసుకువచ్చిన మోటారు సైకిల్‌ను అక్కడే వదిలేసి పారిపోయారు. దీనిపై పోలీసు దర్యాప్తు సాగుతోంది.

ఏడాదిగా నిత్యం కాపలా..

మిర్చిమేరీగోల్డ్ రకం మొక్కలు, విత్తనాలను దొంగిలిస్తున్నారు. దీంతో ఏడాదిగా రాత్రింబవళ్లు వీటివద్ద కాపలాగా ఉండాల్సి వస్తోంది. నేను లేకపోతే కూలీలనైనా కాపలాగా ఉంచుతున్నాం. అత్యంత నెమ్మదిగా ఈ మొక్క ఎదుగుతుంది. దీనికి తోడు ప్రస్తుతం డిమాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో మొక్కలను దొంగిలిస్తున్నారు.

– జి.వీరబాబు, రైతు, బుర్రిలంక

రేపు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ/కడియం: విద్యుత్ అత్యవసర మరమ్మతుల కోసం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ వేమగిరి, కడియం, కె.సావువరం, జేగురుపాడులో అంతరాయం కలుగుతుందన్నారు.

- ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ నగరంలోని బాబానగర్, ఏవీ అప్పారావు రోడ్డు, వెంకట రామయ్య నగర్, గోపాల్ నగర్ పుంత, నాగమ్మ తల్లి గుడివీధి, డీవీబీరాజు అపార్ట్‌మెంట్ ఏరియా, నారాయణపురం, భాష్యం స్కూల్, గెయిల్ ఆఫీస్ బ్యాక్ సైడ్, రూరల్ ఏరియాలోని మోరంపూడి జంక్షన్, సాయినగర్, వెంకటగిరి–2, బాపూజీ నగర్, గంగిరెడ్ల కాలనీ, హనుమాన్ నగర్, గాదాలమ్మ నగర్, హుకుంపేట విలేజ్, డీమార్ట్ వెనుక, మీనాక్షి లేఅవుట్, ఎం.మార్బుల్ వెనుక తదితర ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు. సత్యసాయి గురుకులం, బొమ్మూరు, రాఘవేంద్ర కాలనీ, వెంకటేశ్వర నగర్, నవభారత్ నగర్, టీచర్స్ కాలనీ, ఏసీబీ కాలనీ, చెరువు గట్టు, బాలాజీపేట జంక్షన్, విక్టరీ బజారు వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.
- నగరంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జాంపేట, సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

మందులన్నీ ఉచితంగా అందించాలి

- ఎంపీ భరత్‌రామ్
- అర్బన్ హెల్త్ సెంటర్ పరిశీలన



అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

కంబాలచెరువు: పేద ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు వారికి అవసరమైన మందులు కూడా ఉచితంగానే ఇవ్వాలని, హెల్త్‌సెంటర్లకు వస్తున్న వారిని మందులు బయట ఎందుకు కొనుక్కోమని చెబుతున్నారంటూ ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రశ్నించారు. ఆర్ట్స్ కళాశాల సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. అక్కడ వైద్య సిబ్బందితో మాట్లాడారు. డబ్బులు ఎందుకు తీసుకుంటున్నారని అక్కడ వైద్య సిబ్బందిని ఆయన అడుగగా అటువంటిదేమీ లేదని వారు తెలిపారు. హాస్పటల్లో ఉన్నంత వరకూ మెడిసిన్ ఉచితంగానే ఇస్తున్నామని, హెల్త్‌సెంటర్‌లో అందుబాటులో లేకపోతే బయట కొనుక్కోమని చెబుతున్నామన్నారు. దీనిపై ఎంపీ మాట్లాడుతూ కచ్చితంగా మందులు కూడా వారికి ఉచితంగానే ఇవ్వాలని, స్టాక్ ఏమి అవసరమో గుర్తించి వాటిని తెప్పించుకోవాలన్నారు. గడపగడపకూ కార్యక్రమంలో పర్యటిస్తున్నప్పుడు ఇవే ఫిర్యాదులు వచ్చాయన్నారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించి సూచనలను ఇచ్చారు. కాగా.. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గౌడ శెట్టిబలిజ సంఘం నగర అధ్యక్షుడు రెడ్డి రాజును ఎంపీ భరత్ పరామర్శించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక వై.జంక్షన్ వద్ద ఆనం రోటరీ హాలుకు ఆనుకుని ఉన్న స్థలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీ భరత్ రామ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నగర పాలకసంస్థ ఎస్ఈ పాండురంగారావుతో మాట్లాడి, ఆ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే డ్రైనేజీ సమస్యను ప్రజల విజ్ఞప్తి మేరకు పరిశీలించారు. త్వరలోనే కాలువలో పూడిక తొలగించి సక్రమంగా మురుగునీరు పారేలా చర్యలు తీసుకుంటానని ఆ ప్రాంత వాసులకు హామీ ఇచ్చారు. పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సిటీ యూత్ ప్రెసిడెంట్ పితా రామకృష్ణ, అన్నపూర్ణరాజు పాల్గొన్నారు.

కుష్టు బాధితులకు చెప్పుల పంపిణీ



చెప్పులు అందజేస్తున్న డాక్టర్ వసుంధర

రాజమహేంద్రవరం రూరల్: లెప్రసీ వ్యాధిగ్రస్తులు కాళ్లకు చెప్పులు ధరించడం ద్వారా గాయాల నుంచి తప్పించుకోవచ్చని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణాధికారి డాక్టర్ ఎస్.వసుంధర అన్నారు. ఆమె బుధవారం బొమ్మూరులోని ఎవెంజిలిన్ హెల్పింగ్ హ్యాండ్స్ లెప్రసీ కాలనీని సందర్శించారు. కాలనీలో ఉంటున్న 27 మంది బాధితులకు మైక్రో సెల్యూలర్ రబ్బర్ చెప్పులను అందించారు. జిల్లా పారామెడికల్ ఆఫీసర్ కె.వీరలక్ష్మి లెప్రసీ వ్యాధిగ్రస్తులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఎంవోలు ఈశ్వరరావు, శివకుమార్, ఏఎన్ఎం కె.శాంతిప్రియ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రానికి రావాల్సిన నిధులపై పవన్ దృష్టి పెట్టాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నక్కా శ్రీనగేష్

రాజమహేంద్రవరం సిటీ: తెలంగాణ మంత్రి హరీష్‌రావుతో కలసి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఏపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తే, అది తెలుగు ప్రజలను విమర్శించినట్లేనని వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా శ్రీనగేష్ ధ్వజమెత్తారు. ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విభజన హామీలు, తెలంగాణ నుంచి రావాల్సిన పంపకాలపై పవన్‌కల్యాణ్ పట్టించుకుంటే మంచిదన్నారు. మన రాష్ట్ర అభివృద్ధిపై తెలంగాణ మంత్రి హరీష్‌రావు చేసిన కామెంట్లపై రాష్ట్ర మంత్రులు కౌంటర్ ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ ప్రజలకు అవమానం జరిగిందంటూ పవన్‌కల్యాణ్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీలకు జనసేన మద్దతిచ్చిందని, అప్పుడు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నోచుకోకుండా ఆ పార్టీలు చేసిన పాపంలో పవన్‌కు కూడా భాగం ఉందన్నారు. పవన్ కల్యాణ్ రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, తానేదో అన్నింటికీ అతీతుడన్న రీతిలో పెద్దన్న పాత్రలో ఊహించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ చైర్మన్ కాటం రజనీకాంత్, రేగుళ్ల బాలశ్రీధర్ పాల్గొన్నారు.

ఖాతాదారుల సంక్షేమానికి నిరంతర కృషి

- ఎన్‌పీఏ తగ్గింపునకు పటిష్ట చర్యలు
- ఆర్యాపురం బ్యాంకు చైర్‌పర్సన్ రామకృష్ణ తులసి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రామకృష్ణ తులసి

రాజమహేంద్రవరం సిటీ: ఖాతాదారుల సంక్షేమానికి ది ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ పాలక వర్గం నిరంతరం కృషి చేస్తుందని చైర్‌పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి అన్నారు. బ్యాంక్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ, బ్యాంకును అభివృద్ధిపథంలో కొనసాగించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్యాంకు ఏ గ్రేడ్ నుంచి క్రమంగా సీగ్రేడ్‌లోకి రావడానికి గత పాలకవర్గంలో చోటుచేసుకున్న పరిణామాలే కారణమన్నారు. బ్యాంక్ మెంబర్లకు గిఫ్ట్ కొనుగోలు కూడా ఎన్నోఏళ్ల నుంచి వస్తున్న ఆనవాయితీయేనన్నారు. డిపాజిటర్లు, ఖాతాదారులు, సభ్యులను దృష్టిలో ఉంచుకుని బ్యాంకును మరింత అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో తమ పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. సెక్రటరీ (ఎఫ్ఏసీ) కొండేటి స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ నెట్ ఎన్‌పీఏ ఆరుశాతం దిగువకు తగ్గించామని, మరింత తగ్గించడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. బ్యాంకులో సేల్ ఆఫీసర్‌ను నియమించామని త్వరలోనే వసూళ్లు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు మజ్జి నూకరత్నం, మార్గాని సురేష్, పెంకే సురేష్ కుమార్, వీణం వెంకటేశ్వర రావు (బిల్డర్ చిన్న), గొర్రిపాటి లీలా గంగాధరరావు (చిన్నబాబు), యర్రా ప్రసాదరావు, రాయుడు గణేష్ పాల్గొన్నారు.

నిబద్ధతతో ప్రజా సమస్యల పరిష్కారం

- కలెక్టర్ మాధవీలత
- అధికారులకు దిశానిర్దేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కారంలో నిబద్ధతతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని కలెక్టర్ మాధవీలత అన్నారు. జగనన్నకి చెబుదాం కార్యక్రమంపై ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య బుధవారం సాయంత్రం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపుతున్నామన్నారు. అయినా కొన్ని సందర్భాల్లో ప్రజలు పరిష్కారంపై సంతృప్తి వ్యక్తం చేయకపోవడంతో మరింత జవాబుదారీతనం చూపే దిశలో జేకేసీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. జిల్లాలో పనిచేసే ప్రతి జిల్లా అధికారి, ప్రతి వినతిని పరిష్కారమయ్యేవరకూ ట్రాక్ చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. జిల్లా, డివిజన్, మండల, మునిసిపల్, గ్రామ, వార్డు వరకూ ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టీఈఎం రాజు, జిల్లా పంచాయతీ అధికారి పి.జగదాంబ, కలెక్టరేట్ సాంకేతిక సహాయకులు సతీష్, సూపరింటెండెంట్ ఎం.మేరికమ్మ పాల్గొన్నారు.

బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచార భేరి

ప్రకాశం నగర్: బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ, సీపీఎం ఆల్ ఇండియా కమిటీల పిలుపు మేరకు ప్రజాపోరు యాత్రలో భాగంగా చేపట్టిన ప్రచార భేరి బుధవారం స్థానిక క్వారీ సెంటర్ నుంచి సుబ్బారావు నగర్, సారంగధరమెట్ట వరకు జరిగింది. ముఖ్యఅతిథులుగా హాజరైన సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలను పెంచుతూ పేద, మధ్యతరగతి జీవితాలను దుర్భరం చేస్తోందన్నారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతోందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కుండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, నల్ల రామారావు పాల్గొన్నారు.

వర్షాకాలానికి ముందే పూడికతీతలు



కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: వర్షాకాలం ప్రారంభానికి ముందే నగరంలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు పూర్తికావాలని నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. స్థానిక 34, 35, 40, 41 డివిజన్లలోని సీతంపేట, మూలగొయ్యి, ఆర్యాపురం ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు కాలువల్లో చెత్త పేరుకుపోవడాన్ని గమనించారు. సిబ్బంది పనితీరు, అధికారుల పర్యవేక్షణపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయడం, వ్యాపార సంస్థలు, హోటళ్ల నుంచి వ్యర్థాలు ఎక్కువగా డ్రైనేజీల్లో కలుస్తున్నట్టు తెలుస్తోందన్నారు. అటువంటి వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ ఇంటి వద్ద చెత్తను డస్ట్‌బిన్లలో వేసి చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలన్నారు. మురుగు కాలువల స్థితిగతులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తనకు నివేదికలు అందజేయాలని శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్‌కు ఆదేశించారు. రాత్రివేళ వీధులను శుభ్రం చేస్తున్న స్వీపింగ్ యంత్రం పనితీరును పరిశీలించారు. కమిషనర్ వెంట ఎంహెచ్ఓ డాక్టర్ ఎ.వినూత్న తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌పై అవగాహన అవసరం

- డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటేశ్వరరావు
- వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం

కంబాలచెరువు: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌పై వైద్యాధికారులు, సిబ్బందికి పూర్తిస్థాయి అవగాహన అవసరమని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని వైద్యాధికారులు, సూపర్ వైజర్లకు గురువారం గురువారం ఆనం కళా కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ ప్రతి గర్భిణికి పరీక్షలు పరీక్షలు నిర్వహించాలని, ప్రసవ తేదీకి అనుగుణంగా వారం రోజుల ముందుగానే హాస్పిటల్లో చేరేలా ఏర్పాట్లు చేయాలన్నారు. డీఎల్‌టీవో డాక్టర్ ఎస్.వసుంధర మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, అన్ని సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు, విలేజ్ హెల్త్ కమిటీలను ప్రతి సమావేశంలోనూ వీటిపై మాట్లాడాలన్నారు. జిల్లా మలేరియా అధికారి జి.వీర్రాజు మాట్లాడుతూ ప్రతివారు శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఏఎన్ఎం హెల్త్ యాప్‌లో లాగిన్ అయ్యి ఫొటోలు పెట్టి క్లియర్ చేయాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ కోవిడ్ లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్యం చేయించుకోవాలన్నారు. సమావేశంలో కొవ్వూరు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జి.వరలక్ష్మి, పీహెచ్‌వో నాగు, డాక్టర్ సుధీర్, డాక్టర్ సూర్య పాల్గొన్నారు.

జగన్ పాలనలో అందరి సంక్షేమం

- ఎంపీ భరత్‌రామ్
- 46వ డివిజన్‌లో గడప గడపకూ..



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల సంక్షేమం జరుగుతోందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 46వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మేడబోయిన సునీల్ ఆధ్వర్యంలో క్వారీ మార్కెట్ సెంటర్ ఆనంద్ నగర్ దుర్గమ్మ ఆలయం నుంచి బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును, సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని ఆరా తీశారు. డ్రైనేజీ, లోఓల్టేజీ సమస్యలను పలువురు తెలపగా, అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి, వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర యువజన విభాగం అధ్యక్షుడు పితా రామకృష్ణ, తిరగాటి దుర్గ, చోడిశెట్టి పళ్లంరాజు, మురళీకృష్ణ పాల్గొన్నారు.